అక్రమంగా గుట్ట చదును పనులు

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- డాక్యుమెంట్లు తీసుకురావాలని సూచన


గుట్టలో చదును చేసిన ప్రాంతం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నిబంధనలకు విరుద్ధంగా లింగంపల్లికలాన్ శివారులో గల గుట్టపై చేపట్టిన చదును పనులను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామశివారులోని సర్వే నం–230లో కొన్నేళ్ల క్రితం విడతలవారీగా 257 మంది రైతులకు 355 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని పంపిణీ చేశారు. కాగా గతంలో పట్టా పొందినవారు కాకుండా ఇతర వ్యక్తులు ప్రస్తుతం గుట్టను యంత్రాల సహాయంతో చదును చేస్తూ సాగుకు అనుకూలంగా మారుస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఇటీవల ఘటనా స్థలానికి వెళ్లి భూమి చదును పనులను అడ్డుకున్నారు. చదును చేస్తున్న భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను తమకు అందజేయాలని సూచించారు. అయినా ఇప్పటివరకు ఎవరూ కూడ ఎలాంటి డాక్యుమెంట్లను తమకు అందించలేదని అధికారులు పేర్కొంటున్నారు. అసైన్‌మెంట్ భూమికి సంబంధించి పట్టా పొందినవారు మాత్రమే సాగు చేసుకోవాలని, ఆ భూముల్లో క్రయ, విక్రయాలు జరపకూడదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పనులను నిలిపేశాం

లింగంపల్లికలాన్ శివారులో గల సర్వే నం–230లో గతంలో విడతలవారీగా పలువురికి పట్టాలను అందజేశారు. కాగా పట్టాపొందివారు కాకుండా ఇతర వ్యక్తులు గుట్టను చదును చేస్తున్నారని తెలుసుకొని అక్కడివెళ్లి పనులను నిలిపేశాం. ఆ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను తమకు అందజేయాలని సూచించాం. కాని ఇప్పటివరకు ఎవరూ కూడ డాక్యుమెంట్లను తీసుకు రాలేదు.
– శ్రీనివాస్‌రావు, తహసీల్దార్, నాగిరెడ్డిపేట

‘ఆరోగ్యకర అలవాట్లతో క్యాన్సర్ దూరం’


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: మనిషి ఆరోగ్యకర ఆహారపు అలవాట్లు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని, క్యాన్సర్ రాకుండా చూస్తుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి క్యానర్‌పై అవగాహన కల్పించారు. ఐఎంఏ వైద్యులు రాధ రమణ, అరవింద్, మల్లికార్జున్, స్నేహసాగర్ తదితరులు మాట్లాడుతూ.. క్యాన్సర్ నిర్మూలన సామాజిక బాధ్యత అన్నారు. యువతీయువకులు విద్యార్థిదశ నుంచే మంచి అలవాట్లు కలిగి ఉంటే క్యాన్సర్ ముప్పును తప్పించుకోవచ్చని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, ఉమెన్ ఎంపవర్మెంట్ సమన్వయకర్త డాక్టర్ కృప, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

కామారెడ్డి అర్బన్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ, లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో విద్యార్థులు క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పద్మపాణి సొసైటీ డైరెక్టర్ స్వర్ణలత, సమన్వయకర్త వినాయక్, గౌతమి, గోపాల్, వినోద్, లిటిల్ స్కాలర్ హైస్కూల్ కరస్పాండెంట్ పి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కామారెడ్డి రక్తదాతల సమూహం కార్యవర్గం


జమీల్, అనిల్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండీ జమీల్ హైమద్, డాక్టర్ పుట్ల అనిల్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు సమూహం వ్యవస్థాపకులు, నిర్వాహకులు డాక్టర్ ఎస్.బాలు తెలిపారు. మంగళవారం ఎన్నికలు నిర్వహించగా గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ వేద ప్రకాష్, ఉపాధ్యక్షులుగా గంప ప్రసాద్, వెంకట రమణ, సలహాదారులుగా ఎర్రం చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు.

దండి పీఠాధిపతిగా సుదర్శన స్వామి



బాన్సువాడ: దండి పీఠాధిపతిగా సుదర్శన స్వామిని నియమించారు. బాన్సువాడకు చెందిన సుదర్శన స్వామికి దండి పీఠాధిపతిగా నియమించినందుకు బాన్సువాడ ఆశ్రమం సభ్యులు అభినందనలు తెలిపారు. అఖిల భారత దండి స్వాములు ఆయనను మహా కుంభమేళాలో ఆశీర్వదించారు. కల్పవాసం పూర్తి చేసుకుని బాన్సువాడకు సుదర్శన స్వామి వస్తున్నారు.

పిట్లం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా లోక శ్రీనివాస్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ కుమ్మరి యాదగిరి ఆధ్వర్యంలో, బీసీ రాజ్యాధికార సమితి జుక్కల్ నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్‌చార్జిగా లోక శ్రీనివాస్‌ను నియమిస్తూ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు ఇచ్చిన కుమ్మరి యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. పదవికి న్యాయం చేస్తానన్నారు. సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌రాజ్ పాల్గొన్నారు.

అల్పాహారం కోసం విరాళం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భూంపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించటానికి దాతలు విరాళాలు(రూ.9,600) అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు లోకేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా దాతలు లక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ సాయి రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఏపీపీసీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు లక్ష్మి, నారాయణ, ముత్తెన్న, హైమవతి, ఉమాదేవి, మాలతి, చింతల లింగం తదితరులున్నారు.

వన నర్సరీ పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీ వన నర్సరీని మంగళవారం మండల ప్రత్యేక అధికారి శ్రీపతి పరిశీలించారు. వర్షాకాలం నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు చందు, బాల్ సింగ్, ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి భీం రావ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు తదితరులున్నారు.

‘ప్రతి నెలా 5 లోపు వేతనాలు అందేలా చూడాలి’



కామారెడ్డి టౌన్: ప్రతి నెలా 5 లోపు వేతనాలు అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని కార్మికులు కోరారు. కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా వచ్చిన రాజేందర్‌రెడ్డిని మంగళవారం కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహబూబ్‌అలీ, నాయకులు దీపక్, ప్రభాకర్, ప్రభు, దీవెన, శివరాజవ్వ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హృది స్వప్నం పుస్తకావిష్కరణ



మాచారెడ్డి: చుక్కాపూర్ గ్రామానికి చెందిన కవయిత్రి కందాళ పద్మావతి రాసిన ‘హృది స్వప్నం’ పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించినట్లు పద్మావతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన పలువురు కవులు, రచయితలకు కృతజ్ఞతలు తెలిపారు.

గదుల నిర్మాణం చేపట్టవద్దని తీర్మానం


మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

దోమకొండ: మండల పరిషత్ కార్యాలయం ప్రహరీకి ఆనుకుని గదుల నిర్మాణం చేపట్టొద్దని వివిధ పార్టీల నాయకులు తీర్మానం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ చాంబర్‌లో వివిధ పార్టీల నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో కార్యాలయ ప్రహరీ వద్ద గదులు నిర్మించాలని నిర్ణయించగా నిర్మాణాలు వద్దని వారు ఎంపీడీవోకు వివరించారు. దీంతో అందరి కోరిక మేరకు గదులు నిర్మాణం నిలిపేస్తామని ఎంపీడీవో వారికి వివరించారు. మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు అబ్రబోయిన స్వామి, నర్సారెడ్డి, రామస్వామిగౌడ్, కిషన్‌రెడ్డి, పాలకుర్తి శేఖర్, మోహన్‌రెడ్డి, చింతల రాజేష్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగ, ఉపాధికి కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల కెరీర్ గైడెన్స్, కాంపిటేటివ్ కోచింగ్ సెల్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఐక్యూఏసీ సమన్వయకర్త అంకం జయప్రకాష్, గైడెన్స్ సెల్ సమన్వయకర్త రాజ్ గంభీరావు, ఎకనామిక్స్, హిందీ అధ్యాపకులు సుధాకర్, శ్రీనివాస్‌రావు, అజారుద్దీన్, నవీన్ తదితరులు మాట్లాడారు.

కేశ్వరమండ్ల విగ్రహం ధ్వంసం


నిందితులను కట్టేసిన దృశ్యం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రం శివారు స్మశానవాటిక సమీపంలో గల అతిపురాతనమైన కేశ్వరమండ్ల విగ్రహాన్ని ధ్వంసం చేసి కింద పడేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిందెవరని గ్రామస్తులు ఆరా తీశారు. రైస్‌మిల్లులో పని చేస్తున్న బిహార్ కార్మికులే ఈ పనికి పూనుకున్నట్లుగా గుర్తించారు. దీంతో గ్రామస్తులు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కట్టేసి దేహశుద్ధి చేశారు. మద్యం మత్తులో అలా జరిగిందని మరికొంత మంది కార్మికులు సమాధానం ఇచ్చారు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానిక చేరుకున్న పోలీసులు విచారణ జరుపుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

‘బీమాలో 100 శాతం విదేశీ పెట్టుబడులు వద్దు’


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న యూనియన్ నేతలు

కామారెడ్డి అర్బన్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడుల బీమా చట్ట సవరణ బిల్లు–2024ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కామారెడ్డి ఎల్‌ఐసీ శాఖ ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బిల్లు వెనక్కి తీసుకోకపోతే సమ్మెకు వెనుకాడబోమన్నారు. దేశ భక్తి కలిగిన వారందరూ పోరాటంలో భాగస్వామ్యం కావాలని, తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు. నాయకులు సంపత్ కుమార్, కేవై అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, రమేష్, దామోదర్, నర్సింలు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి


మోతెలో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్


సంఘమేశ్వర్‌లో పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్


కోనాపూర్‌లో వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు, తండాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన మోతె శివారులో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరగడానికి ప్రతి రోజు నీరు పట్టాలని సూచించారు. అలాగే కంపోస్టు షెడ్డు, స్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేసవి కాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో ముందే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పాల్గొన్నారు.

కోనాపూర్‌లో..

బీబీపేట: తాగునీటి సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అన్నారు. మంగళవారం కోనాపూర్‌లో తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు.ఆయన వెంట ఎంపీవో అబ్బాగౌడ్, కార్యదర్శి భరత్ ఉన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో తాగునీటి సమస్య నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీవో ప్రకాష్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి, వెల్లుట్ల, వెల్లుట్లపేట, తిమ్మారెడ్డి తండాలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ముందస్తు చర్యలలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు.

సమస్యలను గుర్తిస్తాం

దోమకొండ: గ్రామాల్లో తాగు నీటి సమస్యలు గుర్తిస్తామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం సీతారాంపల్లి, సంగమేశ్వర్, అంబారీపేట్‌లలో మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలపై అధికారులకు నివేదిస్తామని తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఏఈలు శిరీష, వంశీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు .

డ్రోన్ సహాయంతో పురుగు మందుల పిచికారీ



నిజాంసాగర్(జుక్కల్): గోర్గల్ శివారులో మంగళవారం డ్రోన్ ద్వారా పంట పొలాలకు పురుగు మందులు పిచికారీ చేయించారు. యాసంగి వరి పంట పొలాలలో తెగుళ్ల బెడద అధికంగా ఉండటంతో మండల వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్ సూచనల మేరకు రైతులు డ్రోన్ సహాయంతో పురుగు మందులు పిచికారీ చేయించారు. కూలీల కొరత ఉండటంతో రైతులు డ్రోన్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. స్థానిక నాయకులు దుర్గారెడ్డి, రైతులు కాశాగౌడ్, వినోద్ తదితరులున్నారు.

‘ప్రభుత్వమే నిత్యావసరాలు అందించాలి’



ఎల్లారెడ్డి : ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం భోజనం సరఫరా చేసేందుకు ప్రభుత్వమే నిత్యావసర వస్తువులను అందించాలని ఎండీఎం నిర్వాహకులు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. మెనూ ప్రకారం భోజనం అందించడానికి ప్రతి విద్యార్థికి రూ.25 చొప్పున అందించాలని లేని పక్షంలో నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని వారు విన్నవించారు. సరిపడా డబ్బులు ఇవ్వకుండా ఎండీఎం నిర్వాహకులు, సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయవద్దని విన్నవించారు. ఎండీఎం నిర్వాహకులు సోఫియా, సాయిలు తదితరులున్నారు.

మట్టి అక్రమ తరలింపును అడ్డుకోండి



మద్నూర్(జుక్కల్): చెరువులో మట్టిని అక్రమంగా తరలించడాన్ని అధికారులు అడ్డుకోవాలని అవాల్‌గావ్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయానికి అవాల్‌గావ్ గ్రామస్తులు తరలి వచ్చి సోమవారం తహసీల్దార్ ముజీబ్‌కు వినతి పత్రం అందించారు. సరిహద్దులోని మహారాష్ట్రకు చెందిన వారు అక్రమంగా గ్రామంలోని చెరువు మట్టిని తరలిస్తున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తులు బాలాజీ, దత్తు, విఠల్, సాయిలు, యాదు, ప్రమోద్‌పటేల్, పండరిగౌడ్, దత్తప్ప తదితరులున్నారు.

‘సర్వే రిపోర్టు తప్పుల తడకగా ఉంది’

కామారెడ్డి టౌన్: కుల గణన సర్వే రిపోర్టు అంతా తప్పుల తడకగా ఉందని, బీసీ లెక్కలను తక్కువ చేసి అవమానించారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2014లో బీసీలు 54శాతం ఉంటే తాజా సర్వేలో 46 శాతానికి ఎలా తగ్గారని ప్రశ్నించారు. బీసీలపై కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): లక్ష డప్పులు–వేల గొంతులు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు నెల్లూరి గంగారాం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7వ తేదీన నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి మాదిగలు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఎల్‌బి స్టేడియం నుంచి పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీలో పాల్గొని యావత్తు మాదిగ జాతి దండోరా శక్తిని ప్రపంచానికి చాటాలని కోరారు. మండల కోశాధికారి మన్నె బాలయ్య, జిల్లా నాయకులు లెగ్గల రాజు, భూపతి, సంగమేశ్వర్, రాజు, పోచయ్య, వెంకట్ పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. సోమవారం నాటికి 2 లక్షల 74 వేల 811 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.


పొంచి ఉన్న ప్రమాదం


బీటీ రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం

దోమకొండ: మండల కేంద్రం నుంచి ముత్యంపేట గ్రామానికి వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వ నిధులతో కామారెడ్డి మండలం క్యాసంపల్లి నుంచి ముత్యంపేట మీదుగా దోమకొండ వరకు డబుల్ రోడ్డు వేశారు. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న సమయంలో స్తంభాలు రోడ్డుకు దూరంగా ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డును వెడల్పు చేసి డబుల్ రోడ్డుగా మార్చడంతో స్తంభాలు రోడ్డుకు బాగా దగ్గరగా వచ్చాయి. వాహనదారులు ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులు. ఈ విషయంలో విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దూరంగా మార్చాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మికం..

మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడిలో మంగళవారం మల్లికార్జున మల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. డప్పు వాయిద్యాల మధ్య మల్లన్న విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో నూతనంగా ఆలయం వరకు తీసుకెళ్లారు. బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలుంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ..



దోమకొండ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాల ఊరేగింపు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కంది గంగాధర్, కంది రాజయ్య, పండరి, శ్రావణ్, ముత్యం, శ్రీనివాస్, లింబాద్రి, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్ర స్వామి ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్: మౌలాన్ ఖేడ్ శివారులో గల వీరభద్ర స్వామి ఆలయంలో వార్షిక ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా అగ్ని గుండాలను ఏర్పాటు చేశారు. భక్తులు అగ్ని గుండాలలో నడిచి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి విగ్రహాల ఊరేగింపు



బీబీపేట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు ఏకరూప దుస్తులు ధరించి కోలాటం ప్రదర్శించారు. ప్రధాన చౌరస్తాలో వారి సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సరస్వతి మాతకు పూజలు



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి మాతకు యజ్ఞం నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. అలాగే గ్రామస్తులు నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాఠశాలలో అన్న సంతర్పణ చేశారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



భిక్కనూరు: తిప్పాపూర్‌లో రేణుకాదేవి ఎల్లమ్మ కల్యాణం మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జమదగ్ని మహర్షితో వేదబ్రాహ్మణులు వైభవంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, కట్నకానుకలు సమర్పించుకున్నారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

పద్మశ్రీ గ్రహీత మందకృష్ణకు సన్మానం



నిజాంసాగర్(జుక్కల్): పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతారావు, వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్యలు కలిసి సన్మానించారు. పద్మశ్రీ పురస్కారం అందుకోవడం పూర్వజన్మసుకృతమని ఎమ్మెల్యేలు కొనియాడారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

ఎల్లారెడ్డిరూరల్: సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహేశ్ కుమార్‌కు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందించారు. సరిపడా వేతనం లేక ఇబ్బందులకు గురవుతున్నామని, పెండింగ్ పీఎఫ్ డబ్బులను కూడా చెల్లించాలని వారు విన్నవించారు. పారిశుధ్య కార్మికులు తదితరులున్నారు.